నమస్తే తెలంగాణ

ఫేక్ వీడియోల తంటా

కృత్రిమ మేధ వల్ల మానవాళికి ముప్పు తప్పదని విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ తరచుగా హెచ్చరించేవారు. ఆ మాటేమో గానీ, సినిమా హీరోయిన్లకు, ప్రముఖులకు మాత్రం (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ఏఐ వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. హీరోయిన్ రష్మిక మందన్న డీప్ ఫేక్ వీడియో వైరల్ కావడం తెలిసిందే. ఆ వీడియోలో రష్మిక ఎక్స్‌పోజింగ్ డ్రెస్ వేసుకొని తిరుగుతున్నట్టు కనిపిస్తుంది. మామూలు కంటితో అది రష్మిక కాదని గుర్తుపట్టడం కొంచెం కష్టమే. ఏఐ వల్ల ఏర్పడిన తంటా ఇది. ఈ ఉదంతంతో సినిమా రంగం ఉలిక్కిపడింది. రష్మిక తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం, అమితాబ్ బచ్చన్ ఆమెకు సంఘీభావం తెలుపడం సెన్సేషన్ అయింది. అమితాబ్‌తో పాటు మరికొందరు సినీ నటులు డీప్ ఫేక్ తయారీదారులపై న్యాయపరంగా చర్యలు తీసుకోవాలని కూడా ఆమెకు సూచించారు. కాగా ఈ ఘటనను కేంద్ర సమాచార సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఖండించడం గమనార్హం.

ఇలాంటి ఫేక్ వీడియోలు తయారుకావడం ఇదే మొదటిసారి కాదు. నిజం గడప దాటేలోపు అబద్ధం ఊరంతా చుట్టొచ్చినట్టుగా అవి ఫేక్ వీడియోలు అనే సంగతి బైటపడేలోగా కోట్లాది మందికి చేరుతాయి. ఇలాంటివి సినీ ప్రముఖులకే పరిమితం కాదు, రాజకీయ నాయకులకు సంబంధించిన ఫేక్ వీడియోలు కూడా విడుదల చేయడం గురించి మనం వింటూనే ఉన్నాం. ఇందులో కాపీ రైట్ సమస్య కూడా ఇమిడి ఉన్నది. డీప్ ఫేక్ చేసే మూల వీడియో యజమానుల హక్కుల మాటేమిటనేది ఇక్కడ ప్రశ్న. తన ఆకార వికారాలను కాపీ చేసి ఫేక్ వీడియోలు తయారుచేస్తున్నారంటూ మేధో హక్కుల పరిరక్షణ చట్టం కింద హిందీ నటుడు అనిల్ కపూర్ ఢిల్లీ హైకోర్టులో కేసు వేశారు. ఆయన స్టైల్‌ను అనుమతి లేకుండా ఏఐ ద్వారా ఎలాంటి వాణిజ్య అవసరాలకు వినియోగించరాదని 16 కంపెనీలను ఆదేశిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఆదేశించింది. దీన్ని మన దేశంలో ఏఐపై మొదటి న్యాయ విజయంగా అభివర్ణిస్తున్నారు. తన గొంతును మిమిక్రీ చేసి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తుండటంపై బిగ్ బీ అమితాబ్ బచ్చన్ కూడా కోర్టుకు వెళ్లడం తెలిసిందే.

ప్రస్తుతం ఏఐ అంశంపై హాలీవుడ్ సినీరంగం సమ్మె చేస్తుండటం ప్రపంచ స్థాయిలో సమస్య తీవ్రతను తెలియజేస్తున్నది. ఏఐ ద్వారా ప్రముఖ నటుల 'వర్చువల్ అవతార్'లను తయారుజేసే ప్రాజెక్టులు జోరందుకోవడమే ఇందుకు కారణం. వాటిని ఉపయోగించి సినిమాలు తీస్తే ఇక తమ గతి ఏం కావాలని వారు ప్రశ్నిస్తున్నారు. అంటే ఓ వైపు రష్మిక వంటివారు ఏఐ వీడియోలతో తమ పరువు బజారున పడుతున్నదని కలత చెందుతుంటే మరోవైపు నటుల ఇమేజ్‌ను కాపీ చేసి యాడ్స్ తదితర అవసరాలకు వాడటం జరుగుతున్నదన్న మాట. రెండూ నాణేనికి చెరోవైపు అని చెప్పాల్సి ఉంటుంది. విడివిడిగా ఎవరికి వారు తమకు అన్యాయం జరిగిందని కోర్టులకు వెళ్లే అవసరం లేకుండా మంత్రి కేటీఆర్ సూచించినట్టు దీనిపై సమగ్రమైన చట్టం తీసుకువచ్చి పకడ్బందీగా అమలుచేస్తే బాగుంటుంది.

ఆ విషపు నాలుకే మట్టుపెడుతుంది

జాతీయ పార్టీ జారుడు బండ మీద నిలబడి అధఃపాతాళంలోకి వేగంగా దిగజారిపోతున్నది. మర్రివృక్షం లాంటి హస్తం పార్టీ ఓ వికృత మానసిక స్థితిలో ఊరేగుతున్న మరుగుజ్జుపై ఆధారపడ్డది. రేవంత్‌రెడ్డి లాంటి పైశాచిక ప్రవర్తనకు అలవాటు పడ్డ వ్యక్తి, స్వహస్తాలతో చేతి గుర్తును మకిలి గుంటలో ముంచేస్తున్నాడు. నింగిపై బురద విసరాలనే లేకితనంతో కాంగ్రెస్ ముఖంపై ప్రజారాశులు ఉమ్మేసే వాతావరణాన్ని కోరి కల్పించాడు.

డాక్టర్ ఆంజనేయ గౌడ్



నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుందనే నానుడి నెత్తికెక్కని ఉన్మాదిని పీసీసీ అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టుకొని, మోరీలా మారిన ఆయన నోటికి మైకులు తొడిగి ఊరేగిస్తే, తెలంగాణ సహిస్తుందా? అసలే దశాబ్దాల దగా చరితను నుదిటిపై హస్తం పార్టీ భారీ అక్షరాలతో రాసుకున్నది చాలక, నోరు పారేసుకొనే రేవంత్‌ను ముందేసుకొని, వారే తలకొరివి పెట్టుకుంటున్నారు. కారణజన్ముడిపై, తెలంగాణ నలుమూలల ప్రగతిని పరిచిన పాలకుడిపై, ప్రజలందరూ తమ పెద్ద సారుగా మన సారా గౌరవించుకునే కేసీఆర్‌పై అడ్డగోలు మాటలతో ఆగమైపోతున్నదెవరు? నదికి నిప్పు పెట్టగలననుకునే పొలిటికల్ పరంధామయ్య నోటి దూలకు గాంధీభవన్ కుప్పకూలిపోతుండటం చూసి, ఆ పార్టీని వీడలేక మిగిలిపోయిన గుంపు కూడా గుండెలు బాదేసుకుంటున్నారు. పదునైన కరవాలం కంటే, విషపు నాలుక ఎంతో ప్రమాదకరమైంది. అది తన పిల్లలను మింగేసే నాగుపాములా మారి, నమ్మిన రాజకీయ పార్టీలనే నిలువునా మింగేస్తుందనే సత్యం రేవంత్‌రెడ్డి వల్ల లోకమంతా వెల్లడైంది. గతంలో టీడీపీలోనూ ఇదే వాగుడు, దారితప్పిన దూకుడుతనాన్ని చూపి సైకిల్‌ను శంకరగిరి మాన్యాలకు చేర్చాడు. ఇప్పుడు మళ్లీ అదే బాటలో బరితెగిస్తూ ఢిల్లీ పార్టీని బొందపెడుతున్నాడు. రాజకీయ రాచపీనుగ కార్యకర్తలందరి కష్టాన్ని, త్యాగాలను తనతో పాటే శ్మశాన వాటికకు తరలించేదాకా విశ్రమించడు.

రాజకీయాలు సమాజానికి సూర్యోదయాన్ని చూపే చూపుడు వేలు లాంటివి. ఎందరో నేతలు హుందాతనంతో కూడిన నడవడికతో విలువైన ప్రజా జీవితాన్ని ఆస్వాదించారు. దేశ రాజకీయాల్లో విభిన్న భావజాలాలతో రాజకీయ ప్రస్థానం కొనసాగించి జాతీయస్థాయిలో కాంగ్రెస్, బీజేపీ, జనతా తదితర రాజకీయ పార్టీలకు నాయకత్వం వహించిన అనేకులు, కూర్చున్న కుర్చీకి కళంకం తెచ్చే పలుకులు కలలో కూడా పలువరించలేదు. దేశం ఎన్నో విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్న సందర్భాల్లోనూ, పార్లమెంట్ లోపల, వెలుపల గంభీరమైన రాజకీయ వాతావరణం నెలకొన్న స్థితుల్లోనూ, దిగజారి తూలనాడేతనం కనబరచలేదు. ఒకానొక సందర్భంగా లోక్‌సభలో ప్రధాని నెహ్రూ విదేశీ పర్యటనపై కమ్యూనిస్టు నాయకుడు సుందరయ్య కాస్త తీవ్రంగా మాట్లాడి, మరునాడే విశాల దేశవాసులు ఎన్నుకున్న దేశ నాయకుడిపై నోరుజారడం తప్పని, నిండు సభలో క్షమాపణ కోరి విలువైన రాజకీయాలకు భాష్యం చెప్పారు. తొలినాళ్ల పార్లమెంట్‌లో నవ యువకుడైన వాజపేయి కూడా వరదలాంటి వాగ్ధాటి కలిగి ఉన్నా, కట్టుబాట్లను దాటి వాగిందే లేదు. అంబేద్కర్, లోహియా అంతెందుకు కేసరి నుంచి పీవీ వరకు హస్తం పార్టీని నడిపించిన మేరునగధీరులు సైతం భాషను ఆచి తూచి వాడారే కానీ, బాధించే ధోరణి ప్రదర్శించలేదు. నిన్నటి ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లోనూ ఒకరో ఇద్దరో, భావోద్వేగంతో నోరు తూలారేమో గానీ, నవ్వుల పాలయ్యే నైజాన్ని నమ్ముకోనే లేదు.

దశాబ్దాలుగా వివక్ష ఉరికొయ్యకు తెలంగాణను వేలాడదీయడంపై నిప్పుల వాగై ఎదురునిలిచిన కేసీఆర్ సైతం విషయాన్ని నమ్ముకొని, వాస్తవాల భాస్వరంలా ప్రసంగించారేగానీ ఏనాడూ ఎవరినీ అదే పనిగా దూషించలేదు. ఎన్నో అవాంతరాలు ఎదురైనా, నిత్యం నిప్పుల దారిలో నడక సాగించినా, రాజకీయకుట్రల పర్వతాలైన వైఎస్సార్, చంద్రబాబులతో ఏండ్లకేండ్లు తలపడుతున్న సందర్భంలోనూ, నేల నొప్పులకు పరిష్కారం కావాలనే తపనతో ప్రశ్నల కొడవలై కేసీఆర్ తిరగబడ్డరే గానీ, ఏనాడూ చిన్నబుచ్చుకునే మాట తీరును చూపించలేదు. కేసీఆర్ ప్రసంగానికి తెలంగాణే ప్రాణ వస్తువు. ప్రజల భవితవ్యమే కొలమానంగా, వేదికలపై చాట్లో పోసుకొని చెరిగే నిప్పుల్లా మాటలను వదిలారే గానీ, ఎవరిపై వ్యక్తిగత ద్వేషంతో విపరీత వ్యాఖ్యలు చేయలేదు. ఉద్యమ నేతగా, పోరు నావను ఆగిపోకుండా నడిపే ఆశయంతో, తన నరాలన్నింటినీ నాలుకకు ఇరుసుగా మలిచి, మనిషే మండే మహాగోళమై నాటి పాలకులను తరిమినా, పదే పదే ఏ నేతపై అనవసర మాటల తూటాలను సంధించలేదు. ఊపిరి ఆగిపోయే సందర్భం ఎదురుపడ్డప్పుడు కూడా కేసీఆర్ సాటిలేని వ్యక్తిత్వాన్ని చాటుకున్నాడు. అందుకే చారిత్రక పురుషుడిగా జనం జేజేలు పొందుతున్నాడు. రాజకీయాల్లో ఏ లెక్కలో, సమీకరణాలో, ప్రత్యేక పరిస్థితులో వరమై ఎన్నికల్లో గెలిచి చట్టసభల సభ్యులుగా చాలామంది అడుగుపెట్టవచ్చు. అందులో కొందరే ప్రజల హృదయాల్లోకి నడిచివెళ్లగలరు. కాలం కలిసివచ్చిన ఎందరో చట్టసభల్లో, మీడియాలో చోటు దక్కించుకోగలరు గానీ కేసీఆర్‌లా చరిత్ర నుదిటిపై నిలిచిపోలేరు. ప్రజా ప్రేమను పొందాలనుకునే నేతల నోటి మాట రామబాణమంతటి శక్తివంతమైనది. వారి మాటకు సమాజ ప్రయోజనమే గీటురాయిగా ఉండాలేగానీ, గిల్లి కజ్జాలాటకు వాడచూడటం మహాపాపం.

ఇప్పుడు రేవంత్‌రెడ్డి వాగుడు చూసి తెలంగాణ సమాజం మరింత స్పష్టతకొచ్చింది. విలువలను వివస్త్ర చేసే నయా దుశ్శాసనుడి నడవడికను గమనించిన జనం పీసీసీ అధ్యక్షుడికి పొలిటికల్ పాడెను కట్టిపెట్టారు. 'నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్టు నోటినిండా మురికి మాటలను నింపుకొన్న రేవంత్‌రెడ్డి వచ్చే నెల 3 తర్వాత జైలులో ఓ మూలకు నక్కడం ఖాయమని తేలిపోయింది. కాకపోతే ఇలాంటి పులి తోలు కప్పుకొన్న నక్కలు మనకో సందేశాన్నిచ్చి మరుగున పడిపోతాయి. మన ప్రజాస్వామ్య వ్యవస్థ విజయ ప్రస్థానంలో, ఓట్లు ఏమరుపాటుకు ఒరిగితే జరిగే నష్టం విలువను వెల్లడిస్తాయి.

మహా భారతంలో దుర్యోధనుడికీ ఓ పాత్ర ఉన్నట్టు, రామాయణంలో సీతను అపహరించడానికి రావణాసురుడిని ప్రేరేపించిన అకంపనా, హనుమంతుడి చేతిలో నేలకరిచినట్టు, రేవంత్‌రెడ్డి లాంటివారు కూడా ఎన్నికల సమరంలో ఓటర్ల వేటకు కనుమరుగైపోతారు. నడమంత్రపు సిరి నేడు నేల మీద కాలు ఆననివ్వదు కానీ, తొందరగానే తలకిందులుగా కుదేలేసితీరుతుంది. కనకపు సింహాసనమున శునకమును కూర్చుండబెట్టడానికి తెలంగాణ ప్రజారాశులు చైతన్యరహితమైన వారేం కాదు కదా?

కేసీఆర్ లాగా ఆలోచించే, ఆచరించే, అడుగులు వేయించే ధైర్యం, దార్శనికత కరువైన సదరునేత అరుపులతో అందరి దృష్టినీ ఆకర్షించాలనే అర్థరహిత, అసహ్యాతీరు అభాసుపాలు చేస్తుందేమో కానీ అందలమెక్కించదు. ఇలాంటి రాజకీయ మెరుపు తీగలు రాజకీయ ఉరుములా శబ్దం చేసి ఆగిపోతాయే కానీ, ఓట్ల మేఘమై గెలుపు వర్షం కురిపించలేవు. కేసీఆర్‌ను దూషించడమంటే తెలంగాణను తిట్టడమే. నెగ్గాలనుకుంటే కేసీఆర్ కంటే గొప్పగా అడుగులు వేయగల శక్తిని సంపాదించుకోవాలి. ఉద్యమ నేత కంటే ఉన్నతంగా జనం కోసం తపించేందుకు సిద్ధపడాలి. అది రేవంత్ రెడ్డి లాంటి వారికి వెయ్యి జన్మలెత్తినా అలవడటం అసాధ్యం. ప్రగతి విప్లవాన్ని ప్రతి పల్లెకూ సాకారం చేసిన కేసీఆర్‌ను అనే ప్రతి మాటకూ ముందు ముందు మూల్యం చెల్లించుకోకతప్పదు. చేసిన పాపాలకు మరో జన్మలో శాపగ్రస్తుడిగా పుడతాడనే నానుడి నేడు తిరగబడ్డది. ఇప్పుడు అన్నింటికీ ఈ జన్మలోనే లెక్క చెప్పితీరాలనే నూతన ధర్మం ఆచరణలో ఉన్నది. పాత సినిమాలలో విలనిజానికి ప్రతిరూపాలైన రావుగోపాల్‌రావు, రామిరెడ్డి, రఘువరన్‌ల వలె రేవంత్‌రెడ్డి కూడా వర్తమాన తెలంగాణ రాజకీయ చిత్రంలో విచిత్రాల విలన్‌గా గుర్తుండిపోతాడు. విలన్ పాత్రలుంటేనే హీరోల విలువ అర్థమయ్యేది. అది సినిమా అయినా రాజకీయమైనా. తెలంగాణ మళ్లీ నువ్వే గెలవాలి, దానికోసం ఓపికపట్టి ముందడుగు వెయ్యాలి. దృష్టిని దారి మళ్లించాలనే నీతిలేని వ్యూహంతో మొరిగే, ఓర్వజాలని రాజకీయ రాజనాలలను చూసీ చూడనట్టుగా వదిలి నడిచి సాగాలి. ఎవరు తవ్వుకొన్న గోతిలో వారే పడి సమాధి అవుతారనేదే అసలు సత్యం సుమా.. ఆ విషపు నాలుకే హస్తం పార్టీని మట్టుపెడుతుంది. జై తెలంగాణ .

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్)

ఏ సర్వేలకు అందని విషయాలను, ఏ వ్యూహకర్త చెప్పని లోతును కొన్నిసార్లు సాధారణ ప్రజలు చెప్తారు. ఏ చర్య వల్ల ఎలాంటి ఫలితం వస్తుందో పలు సందర్భాల్లో వారు విశ్లేషిస్తారు. ఇలాంటి అనుభవమే మాకు ఎదురైంది. ఎన్నికల హడావుడి. పార్టీలు పోటీలు పడి మరీ ప్రజలకు హామీలిస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో.. ప్రజల జీవితాలను ఎట్లా మారుస్తామో కూడా సోషల్ మీడియాలో ప్రచార హోరును పెంచి చెప్తున్నాయి. మరి ప్రజలు ఏం ఆలోచిస్తున్నారు? వారు గుర్తించిన, గుర్తిస్తున్న అంశాలు ఏమేం ఉన్నాయి? ఈ ఎన్నికల గురించి వారేమనుకుంటున్నారనే విషయాల గురించి మాట్లాడుకుంటూ నేను, ప్రభాకర్‌రెడ్డి కలిసి పాలమూరు జిల్లాకు వెళ్లాం.

తండా ఓటు సారుకే

అస్కాని మారుతీ సాగర్
90107 56666

హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం శివారుకు వెళ్లేదాకా మా చర్చలు సాగుతూనే ఉన్నాయి. పాత పాలమూరు రూపురేఖలు మారడాన్ని స్పష్టంగా గమనించాం. రోడ్డుకిరువైపులా పచ్చదనం, కేసీఆర్ ఎకో పార్కు, సుందరంగా ముస్తాబైన చెరువులు, ఇన్నర్ రింగ్ రోడ్డు అంతా మారిపోయిన అంశాలను చూస్తూ ముందుకుసాగాం. జిల్లా కేంద్రానికి కాస్త దూరంలో ఉన్న హన్వాడ మండలంలోని ఓ చిన్న తండా వద్దకు చేరుకున్నాం. ఎన్నికల విషయాల గురించి నేరుగా మాట్లాడకుండా ఏవేవో కొన్ని ముచ్చట్లు పెట్టిన తర్వాత తండాలను చూసేందుకు వచ్చామని చెప్పాం. వారు మా గురించి తెలుసుకోవాలని ఉత్సుకత చూపలేదు. 'ముందుగా కాస్త ఎంగిలి పడుండి. చాలా దూరం నుంచి వచ్చినట్టున్నారు' అంటూ మాకు భోజనాలు పెట్టారు. మేం ఎవరో వారికి తెలియదు. మాక్కూడా వారెవరో తెలియదు. కానీ, వారిచ్చిన మర్యాద మాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది. జొన్నరొట్టెలు, కోడికూర చేసి పెట్టారు. తాము పేదవారమే అయినా ప్రేమకు, మర్యాద చూపించడంలో ఉన్నతులమని నిరూపించారు. మా కోసం కొంత ఖర్చుపెట్టేందుకు వెనుకాడలేదు. నేను జర్నలిస్టుగా అదే జిల్లావాసిగా అక్కడి పరిస్థితులు నాకు కొంతవరకు తెలుసు. వారి భోజనం, జీవన నాణ్యత వంటి విషయాలనూ గమనిస్తూనే ఉన్నాను. మాటల సందర్భంలో ఎన్నికల ప్రస్తావన వచ్చింది. 'ఓహో మీరు ఎన్నికల గురించి తెలుసుకునేందుకు వచ్చారా?' అని మాకు ఆతిథ్యం ఇస్తున్న ఇంటివారు దాదాపు అందరూ ఒకేసారి అడిగారు. 'హా.. అవును' అని చెప్పాను. సూటిగా సుత్తి లేకుండా వారి మనస్సులో మాట చెప్పారు. 'ఇంకెవరికి సారూ... పదేండ్ల కిందికి, ఇప్పటికి చాలా మారింది. పంటలు పండుతున్నాయి. మా తండాకు వస్తుంటే మీరే చూసింర్రు గదా నీళ్లు, పంటలు. అవి ఇచ్చినోళ్లకు ఓటేస్తం' అంటూ తాము ఎవరికి ఓటేయాలనుకుంటున్నారో చెప్పకనే చెప్పారు.

తమ ప్రాంతంలోని ప్రజలు ఎలాంటి అభిప్రాయంతో ఉన్నారో కూడా చెప్పారు. పదేండ్ల కింద బతుకుదెరువు కోసం ఒంట్లో శక్తి ఉన్నవాళ్లు హైదరాబాద్‌కు వలస వెళ్లేవారు. లేనివారు జిల్లా కేంద్రం పాలమూరుకు వచ్చి చిన్నాచితక పనులు చేసుకునేవారు. కానీ, ఇప్పుడు పచ్చటిచేన్ల బతుకమ్మలా మెరిసిపోతున్న తండాలు కన్పిస్తున్నాయి. ఆకురాలే కాలంలో కూడా పచ్చదనం పర్చుకున్న చెల్కలు అచ్చిపోయేవారిని పలకరిస్తున్నాయి. ఈ వాతావరణమే వారి ఓటు నిర్ణయానికి కారణమై ఉండొచ్చు. అంతేకాదు, ఇండ్ల గురించి, పింఛన్ల గురించి, పెండ్లిళ్ల గురించి, ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న సాయం గురించి చాలా విషయాలు మాట్లాడుకున్నాం. మేం ఇవ్వన్నీ మాట్లాడుతుండగానే మరి కొంతమంది అక్కడికి వచ్చారు. వారు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు. 'నీతిగా బతకాలి. మనకు సాయం చేసినవారికి ఓటేయాలి'. మాట కాస్త అటు ఇటుగా అందరూ అదే చెప్పారు. వాస్తవానికి తండాల్లో మునుపటి తండ్లాట లేకపోవడం కూడా వారి ధైర్యానికి కారణమై ఉండొచ్చు. ప్రతీ తండాకు రోడ్డు సౌకర్యం ఉంది. కొద్దో గొప్పో వ్యవసాయ పొలం ఉంటే దానికి కరెంటు, నీళ్ల సౌకర్యం వచ్చింది. వ్యక్తులుగా, వ్యవస్థగా గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన సరికొత్త మార్పు ఇది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విధానాల ప్రతిఫలాలు ప్రజలకు చేరితే వారు ఎంతటి కృతజ్ఞతతో ఉంటారో చెప్పేందుకు హన్వాడలోని దొనబండ తండా ఓ మంచి ఉదాహరణగా చెప్పొచ్చు.

నాటి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పదేండ్ల కిందట సుమారు 40 లక్షల జనాభా ఉండేది. అందులో సగానికి సగం హైదరాబాద్, బాంబే, ఛత్తీస్‌గఢ్ నగరాలతో పాటు దేశవ్యాప్తంగా జరిగే వివిధ నిర్మాణాల్లో పనులు చేసేందుకు గుంపులుగా వెళ్లేవారు. అక్కడ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారు ఎందరో ఉండగా, అవిటితనంతో బతుకుతున్నవాళ్లు ప్రతీ ఊళ్లో ఇప్పటికీ ఉన్నారు. అంతా కూలీనాలీ చేసుకునే జనం. నీటి వసతిలేని అరకొర భూమి ఉన్నా ప్రయోజనం లేక తండాలకు తండాలే, ఊళ్లకు ఊళ్లే ఖాళీ అయ్యేవి. హైదరాబాద్ నుంచి కర్నూలు వెళ్లేదారిలో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న రెండు వందల కిలోమీటర్ల వరకు కొత్తకోట, వనపర్తి ప్రాంతాల్లో మాత్రమే మనకు పచ్చదనం కన్పించేది. కానీ, ఇప్పుడు దృశ్యం మారిపోయింది. పల్లె, తండా చెరువులు జలసిరులను అద్దుకున్నాయి. మక్కజొన్న, కంది, ఆముదం పంటల స్థానంలో కూరగాయలు, వరి, మిర్చి వంటి పంటలు సాగువుతున్నాయి.

హన్వాడలోని దొనబండ తండాలో అవ్వాతాతలు చెప్పిన మాటలివి. 'తమను బాగుచేసిన వారికే ఓటు' అనే మాట నాగలికర్రుతో జీవనం సాగించే దాదాపు అందరి నోటా వినిపిస్తున్నది. ప్రజలే వాస్తవాలను గుర్తిస్తారు, చేసిన మేలును మర్చిపోబోమని, ఎవ్వరూ మరువొద్దని కూడా వారు తమ చేతల ద్వారా చెప్పారు. గతంలోని అనేక విషయాలను చర్చించుకుంటూ భోజనం పెట్టిన వారికి కృతజ్ఞతలు చెప్పుకొంటూ పట్నం బాట పట్టినం.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)

తెలంగాణ అభివృద్ధి దేశానికి దిక్సూచి

దంటు కనకదుర్గ
89772 43484

నేడు భారతదేశంలో ఒక చిత్రమైన విషయం కనిపిస్తున్నది. గత పదేండ్లుగా కేంద్రంలో పాలించిన భారతీయ జనతా పార్టీ విధానాలతో కొద్దిమంది కోటీశ్వరులు తప్ప, 140 కోట్ల జనాభాకు బతుకు భారంగా మారింది. అయితే 1948 వరకు స్వతంత్ర దేశంగా మనుగడలో ఉన్న హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ రాష్ట్ర చిత్రం ఇందుకు భిన్నంగా ఉంది. కేవలం పదేండ్లలో రాష్ట్ర ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది.

పచ్చటి పొలాలు, అలుగు పారుతున్న చెరువులు, ఆనందపడుతున్న రైతులు, శుభ్రంగా ఉన్న పల్లెలు, సంతోషపడుతున్న అక్కడి వృత్తికారులు, అద్భుతమైన ఆదాయం–బహుశా స్వాతంత్ర్యానంతరం దేశంలోనే ఇంతటి అభ్యున్నతి చూసి ఉండం. కనీస వసతులైన తాగునీరు, సాగునీరే కాదు, పల్లెల్లోని జనాలకు వైద్య సదుపాయాలు, రేషన్, వైకుంఠధామాలు, కావలసినన్ని ఒక దశాబ్దంలో వెలిశాయి. ఇదేమీ మాయ, మంత్రంతో రాలేదు. అధినాయకుడి పట్టుదల, మేధస్సు, ప్రణాళికలు, వాటి నిర్వహణ, ఎన్నుకోబడ్డ ప్రతినిధులు, అధికారులకు దిశానిర్దేశం–ఇవన్నీ కలిసి సాధ్యమైంది. మరి ఒక చిన్న రాష్ట్రం చేయగలిగిన పనిలో ఒక్కటైనా దేశాన్ని పాలించే నాయకులు ఎందుకు చేయలేకపోయారు? రైతులు, మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు, దారిద్ర్యరేఖ దిగువన ఉన్న సామాన్యులు, అసంఘటిత కార్మికులు, పరిశ్రమలు, తాగునీరు, సాగునీరు, వృత్తి వ్యాపారులు, పట్టణాల అభివృద్ధి నగరాల సుందరీకరణ–బీజేపీ ప్రభుత్వం ఈ రంగాల్లో ఏమి చేసిందో చెప్పగలరా? వారి ప్రభుత్వాలు అధికారం ఉన్న రాష్ట్రాలైనా ఏ రంగంలోనైనా తెలంగాణతో పోటీ పడగలవా? పడలేవు. ఎందుకంటే వారి పార్టీ రహస్య అజెండా ఎన్నికలలో చెప్పినది కాకుండా, వేరే ఉంది. ఇప్పటిదాకా అమలైన కేసీఆర్, నరేంద్ర మోదీ, పథకాలు, ప్రణాళికలు చూస్తే వ్యత్యాసం అర్థమవుతుంది. తెలంగాణ రాష్ట్రంలో జరిగినవి భారతదేశంలో ఎందుకు సాధ్యం కాలేదో తెలుస్తుంది.

ఈ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్, బీజేపీ కంటే ఏ విధంగా సామాన్య ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చిందో, బడుగు, బలహీనవర్గాలను ఆదుకుందో తెలుస్తుంది. మరి బీజేపీ ఎన్నికల్లో ఏం చెప్పిందో, చెప్తుందో, గెలిచాక ఏం చేస్తుందో తెలుస్తుంది. ఆ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నా, రాష్ట్రాలలో ప్రభుత్వం ఏర్పాటుచేసినా దాని సిద్ధాంతాలు ఒకటే కాబట్టి ఈ కింద చెప్పినవి ఆ రాష్ట్రాలలో కూడా జరుగుతాయి. అదే తెలంగాణలో జరిగిన అభివృద్ధి దేశమంతా జరిగితే? ఆలోచించండి. అది జరగాలంటే ముందు బీఆర్ఎస్ అఖండ మెజారిటీతో తెలంగాణ రాష్ట్రంలో 2023 ఎన్నికలలో గెలవాలి కదా! ఇక చదవండి పక్కన ఇచ్చిన 22 తేడాలు.

కేసీఆర్ పథకాలు, ప్రణాళికలు	నరేంద్ర మోదీ పథకాలు, ప్రణాళికలు
1. ప్రకటించిన ఎన్నికల పథకాలు అమలుచేయటం. జనహిత పథకాలు ప్రకటించనవి కూడా చేయటం.	1. గెలిచిన తర్వాత ప్రకటిత పథకాలు పక్కకు, అప్రకటిత పథకాలు అమలు.
2. రైతుబంధు, దళితబంధు, బీసీ బంధు.	2. అదానీ బంధు, అంబానీ బంధు.
3. ఉచిత కరెంటు, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు, పంట మొత్తం కొనుగోలు. రైతుల కుటుంబాల కోసం రైతుబీమా.	3. రైతు కార్పొరేట్ చట్టాలు, నిరసన కార్యక్రమాలపై నిరంకుశత్వం, అణచివేత. వారు చనిపోయినా నిర్లక్ష్యం.
4. గర్భిణులకు పోషకాహార, ప్రసూతి వసతులు, కేసీఆర్ కిట్, ప్రయాణ సౌకర్యాలు.	4. గర్భిణీలపై కూడా అత్యాచారాలు సాగించడం.
5. మైనారిటీలకు గురుకులాలు, ప్రత్యేక పథకాలు–గంగాజమునా తహజీబ్.	5. మైనారిటీలకు బుల్డోజర్ పథకాలు, అక్రమ నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు.
6. స్వాతిలక్రా ఆధ్వర్యంలో షీ టీమ్స్.	6. బ్రిజ్‌భూషణ్ ఆధ్వర్యంలో హీ టీమ్స్.
7. దేవాలయాల ఉద్ధరణ, అర్చకులకు, ఇమామ్‌లకు, పాస్టర్లకు ధన సహాయం.	7. మసీదుల తవ్వకం, ఇతర మతాల మీద విద్వేషం రగలించటం.
8. మరణించిన రైతు నిరశనకారులకు, సైనికులకు ధన సహాయం, నివాళి.	8. వీరోచితంగా మరణించిన సైనికులకు సంతాప సందేశం కూడా పంపకపోవటం.
9. పత్రికా ప్రతినిధులకు ఇండ్ల స్థలాలు, మరణించినవారి కుటుంబాలకు ధన సహాయం.	9. విమర్శించిన పత్రికా ప్రతినిధులకు జైలుశిక్ష, ప్రజలకు స్వతంత్రం కావాలన్న వారికి నిర్బంధం, శిక్ష.
10. వృద్ధులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు, బీడీ కార్మికులకు పింఛన్.	10. వృద్ధులకు ఉన్న వసతులు, రాయితీలు తొలగింపు. పింఛనర్ల నిధిలోంచి కోట్లు మాయం.
11. బీదవారికి వివిధ పథకాలు–రేషన్‌లో సన్నబియ్యం, ధన సహాయం, ఉచిత వైద్యం, ప్రభుత్వ దవాఖానల స్థాపన, బలోపేతం, ముఖ్యమంత్రి నిధి నుంచి ధన సహాయం.	11. బీదవారి వసతులైన గ్యాస్ సిలిండరు ధర పెంపు, ఇతర వస్తువుల ధరలు కూడా ఇబ్బడిముబ్బడిగా పెంపు. జీఎస్టీ విధింపు, ప్రధానమంత్రి నిధి నుంచి వేల కోట్లు మాయం.
12. అన్ని గ్రామాలలో సిమెంటు రోడ్లు, పల్లెలలో శుభ్రత, రాష్ట్రంలో హరితహారం, అడవుల పెంపు, సంరక్షణ.	12. గ్రామాల నిర్లక్ష్యం, అడవులు కార్పొరేట్లకు కైంకర్యం.
13. ట్రాఫిక్ నియంత్రణ, వర్షకాల వరదనీటి నియంత్రణ, బైపాస్ అండర్‌పాస్ బ్రిడ్జిలు, పార్కుల సుందరీకరణ.	13. వరదలలో నష్టం పట్ల నిరాసక్తత, నగరాల ట్రాఫిక్, కాలుష్యం పట్ల నిర్లక్ష్యం. పోర్టులు, విమానాశ్రయాలు కార్పొరేట్లకు కట్టబెట్టడం.
14. రైతు రుణమాఫీ 73 కోట్ల వరకు.	14. కార్పొరేట్ల బ్యాంకు రుణమాఫీ 12 లక్షల కోట్ల వరకు.
15. రుణాలు తీసుకొని సంపద పెంపు దీర్ఘకాలిక లక్ష్యాల సాధింపు. రాష్ట్ర సంపద పెంచి, సంక్షేమ పథకాలు జరపటం, తలసరి ఆదాయం పెంపు.	15. 100 లక్షల కోట్ల రుణం దేశానికి పెంపు. కార్పొరేట్లకు మదుపు, బీదవారి సంక్షేమం కుదింపు. దేశంలో తలసరి ఆదాయం బీద దేశాల కంటే తక్కువ.
16. వైద్య విద్య, పాఠశాలలు, కళాశాలలు, దవాఖానలు, జెన్‌కో వంటివి ప్రభుత్వ ఆధీనం, సంరక్షణ పథకాలు.	16. బ్యాంకులు బీమాలతో సహా ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేట్ సంరక్షణ పథకాలు.
17. లౌకిక పాలన, అన్నిమతాల, కులాల, వర్గాల, జాతులకు సమాన గౌరవం, సంక్షేమం, అందరి మధ్య సహృదయత, స్నేహాల పెంపు, సుహృద్భావ వాతావరణం స్థాపించటానికి కృషి.	17. లౌకిక వ్యతిరేక విధానాలు, ఇతర మతాల, కులాల, వర్గాల, జాతుల, రాజకీయవర్గాల వారి పట్ల విద్వేషం, మత మౌఢ్యం పెంపు. ప్రజలను విడదీసి పాలించే బ్రిటిష్ సిద్ధాంత ఆచరణ. రాజకీయ లబ్ధికి ద్వేషపూరిత వాతావరణ సృష్టి, అలజడి, అల్లర్లు, హింస.
18. ప్రభుత్వ పాఠశాలల స్థాపన, ఉచిత విద్యాబోధన, పుస్తకాల పంపిణీ, పోషకాలతో అల్పాహారం, భోజనం, పారదర్శక విద్యావిధానం, పటిష్ఠత పెంపు.	18. జాతీయ విద్యావిధానంలో లౌకిక, ఆధునిక, శాస్త్రీయ భావాల తొలగింపు, గందరగోళ పాఠ్యాంశాలు, విద్వేషపూరిత సిద్ధాంతాలు.
19. పరిశ్రమల స్థాపన, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం అభివృద్ధి, ఉద్యోగాలు లక్షలలో.	19. నోట్ల రద్దు వంటి పథకాలతో, ప్రైవేటీకరణతో ఉద్యోగాల నష్టం, ఉపాధి కోల్పోవడం.
20. ఎన్నికలలో ప్రజలు గెలిచి బాగుపడాలనే నినాదం.	20. ఎన్నికలలో కేవలం తమ పార్టీ గెలవాలని వీలైనన్ని కుట్రలు, కుతంత్రాలు, అబద్ధాలు.
21. అవినీతి తగ్గింపు.	21. బినామీలతో అవినీతి సంపాదన.
22. ప్రజాహితంగా పరిపాలన, వసతుల నిర్మాణం, రాష్ట్ర సంపద పెంపు.	22. కార్పొరేటర్లకు సహాయంగా పాలసీల మార్పు, పరిపాలన, దేశ సంపద దోపిడీ.